# Meeting between External Affairs Minister and Secretary General of the Gulf Cooperation Council (GCC), H.E. Dr. NayefFalah Mubarak Al-Hajraf

November 10, 2021

# విదేశీ వ్యవహారాల మంత్రి మరియు గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ) సెక్రటరీ జనరల్ గౌరవనీయ డా. నయేఫ్ ఫలహ్ ముబారక్ అల్-హజ్రఫ్ మధ్య సమావేశం

నవంబర్ 10, 2021

1. విదేశీ వ్యవహారాల మంత్రి (ఈఏఎం) డా. ఎస్. జైశంకర్ నేడు న్యూఢిల్లీలో గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ) సెక్రటరీ జనరల్ గౌరవనీయ డా. నయేఫ్ ఫలహ్ ముబారక్ అల్-హజ్రఫ్‌తో సమావేశమయ్యారు. 2021 నవంబర్ 10-11 తేదీల మధ్య జీసీసీ సెక్రటరీ జనరల్ తొలిసారిగా భారత్‌లో అధికారికంగా పర్యటించారు. ఇటీవలి కాలంలో గణనీయంగా పురోగతి చెందిన భారత్-జీసీసీ మధ్య చారిత్రక, స్నేహపూర్వక సంబంధాలను ఇరువురు నేతలు ఈ సందర్భంగా చర్చించారు. భారత్-జీసీసీ మధ్య సంబంధాలను సవివరంగా సమీక్షించారు, అలాగే వాటిని మరింత మెరుగుపరుచుకునేందుకు అనుసరించతగ్గ మార్గాలపై చర్చించారు. గల్ఫ్ దేశాల అభివృద్ధిలో భారత వర్గాలు పోషిస్తున్న పాత్రను జీసీసీ సెక్రటరీ జనరల్ కొనియాడారు. భారత ఆర్థిక వృద్ధిలో తాను కూడా భాగస్వామి కావాలని జీసీసీ కోరుకుంటున్నట్లు ఆయన తెలియజేశారు.

2. కోవిడ్-19 మహమ్మారి సమయంలో తమ తమ దేశాల్లో భారీ స్థాయిలో ఉన్న ప్రవాస భారతీయులను సంరక్షించినందుకు గాను, 2021 ఏప్రిల్-మే మధ్యలో భారత్‌లో సెకండ్ వేవ్ విజృంభించినప్పుడు వైద్య సహాయం అందించినందుకు గాను జీసీసీ దేశాలకు ఈఏఎం ధన్యవాదాలు తెలిపారు. టీకా ప్రక్రియలో భారత్ సాధించిన పురోగతిని ఈ సందర్భంగా సెక్రటరీ జనరల్‌కు ఈఏఎం వివరించారు. మహమ్మారి కారణంగా తలెత్తిన అసాధారణ సవాళ్లను ఎదుర్కొనడంలో భారత్-జీసీసీ మధ్య పరస్పర సహకారంపై ఇరువురు నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. భారత్ నుంచి విమాన ప్రయాణాలపై జీసీసీ దేశాలు ఆంక్షలు మరింత సడలించగలవని, టీకా సర్టిఫికెట్లకు పరస్పర గుర్తింపు లభించగలదని ఈఏఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

3. భారత్-జీసీసీ మధ్య వాణిజ్య, పెట్టుబడుల సంబంధాలపై కూడా ఇరువురు నేతలు చర్చించారు. కోవిడ్ లాక్‌డౌన్‌ల సమయంలో కూడా భారత్, జీసీసీ మధ్య కీలకమైన వాణిజ్యం కొనసాగడంపై వారు సంతృప్తి వ్యక్తం

చేశారు. ఇంధన భద్రత, ఆహార భద్రత, వైద్య సేవల రంగాలు సహా వివిధ సరఫరా వ్యవస్థలను సురక్షితం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఇరు పక్షాలు అంగీకరించాయి. జీసీసీ దేశాల్లోని సావరీన్ వెల్త్ ఫండ్స్ సహా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు భారత్ ఆకర్షణీయ కేంద్రంగా ఉండగలదని ఈఏఎం తెలియజేశారు.

4. రెండు దేశాలకు సంబంధించిన ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై కూడా ఈఏఎం, జీసీసీ సెక్రటరీ జనరల్ తమ తమ అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ ప్రాంతంలో స్థిరత్వం, శ్రేయస్సును పెంపొందించడంలో జీసీసీ నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుండటంపై సెక్రటరీ జనరల్‌ను ఈఏఎం అభినందించారు. తదుపరి భారత్-జీసీసీ ముగ్గురు ప్రతినిధుల (ట్రోయికా) రాజకీయ చర్చలను సాధ్యమైనంత త్వరలో నిర్వహించాలని ఇరు పక్షాలు నిర్ణయించాయి. చివరిసారిగా 2020 నవంబర్‌లో ఈ సమావేశాన్ని వర్చువల్‌గా నిర్వహించారు. రాబోయే నెలల్లో అవగాహన ఒప్పందం (ఎంవోయూ)పై సంతకాలు చేయడం ద్వారా ఈఏఎం, జీసీసీ ట్రోయికా మధ్య వార్షిక సమావేశాలను మరింతగా సంస్థాగతం చేసేందుకు ఇరు పక్షాలు అంగీకరించాయి.

5. 2021 నవంబర్ 11న కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పియూష్ గోయల్‌తో కూడా గౌరవనీయ డా. నయేఫ్ ఫలహ్ ముబారక్ అల్-హజ్రఫ్ చర్చలు జరుపుతారు.

**న్యూఢిల్లీ**

**నవంబర్ 10, 2021**

DISCLAIMER: This is an approximate translation. The original is available in English on MEA's website and may be referred to as the official press release.